క్లుప్తంగా

చిన్నారులకు రోగనిరోధక టీకాలు


అంగన్‌వాడీ సెంటర్‌లో చిన్నారికి మందులు వేస్తున్న వైద్య సిబ్బంది

చాగలమర్రి: స్థానిక కోటగడ్డ వీధిలోని 10వ అంగన్‌వాడీ సెంటర్‌లో బుధవారం చిన్న పిల్లలకు ఆరోగ్య కార్యకర్త లక్ష్మీదేవి ఆధ్వర్యంలో వ్యాధి నిరోధక టీకాలు వేశారు. నెలన్నర వయసున్న పిల్లల నుంచి ఒకటిన్నర సంవత్సరం వయసున్న పిల్లలకు ఈ టీకాలు వేస్తామని ఆమె తెలిపారు. గర్భిణులకు టీడీ ఇంజక్షన్లు, అలాగే నూతనంగా గర్భిణులకు నమోదు చేయించుకున్న వారికి ఎంసీపీ కార్డులు, ఐరన్ మాత్రలు పంపిణీ చేశారు. చిన్నారులకు 5 రకాల వ్యాధులు రాకుండా పెంటా వ్యాక్సిన్, రోటా వ్యాక్సిన్‌లు వేశారు.

ముగిసిన వెదురు వేలాలు


రుద్రవరంలో వేలం నిర్వహిస్తున్న డీఎఫ్‌ఓ వినీత్‌కుమార్

రుద్రవరం: స్థానిక కలప డిపోలో బుధవారం నంద్యాల డీఎఫ్‌ఓ వినీత్‌కుమార్ వెదురు,కలపకు వేలం పాటలు నిర్వహించారు. డీఎఫ్‌ఓ తెలిపిన వివరాల మేరకు.. ఈ ఏడాది రుద్రవరం రేంజిలోని పలు ఏరియాల్లో వెదురు సేకరణకు సంబంధించి ఇచ్చిన లక్ష్యం పూర్తయ్యిందని తెలిపారు. మొదటి,రెండవ,మూడవ తరగతులకు చెందిన 13,600 వెదుర్లకు చివరి వేలం నిర్వహించగా రూ.3.45 లక్షల ఆదాయం ప్రభుత్వానికి సమకూరింది. అలాగే వివిధ జాతులకు చెందిన కలపకు వేలం వేయగా వేలం పా డేందుకు కాంట్రాక్టర్లు ఎవ్వరూ ముందుకు రాలేదు. నేటితో వెదురు వేలాలు ముగిశాయని, ఈ ఏడాది అక్టోబర్ నుంచి వెదురు సేకరణ తిరిగి మొదలవుతుందని చెప్పారు. రుద్రవరం రేంజి అధికారి శ్రీపతినాయుడు, డీఆర్వో ముర్తుజా, ఫారెస్టర్లు నాగరాజు, రాణెమ్మ, శ్రీనివాసరెడ్డి, కాంట్రాక్టరు కొల్లం పుల్లయ్య ఉన్నారు.

నాసిరకం విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

చాగలమర్రి: విత్తన దుకాణాల్లో నకిలీ, నాసిరకం విత్తనాలను రైతులకు అమ్మితే దుకాణాల లైసెన్సులను రద్దు చేయడమే కాకుండా చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని మండల వ్యవసాయాధికారి రంగ నేతాజీ స్పష్టం చేశారు. బుధవారం స్థానిక నవత విత్తన దుకాణంలో నందిని సీడ్స్ కంపెనీకి చెందిన బిపిటి 5204 శాంపిల్స్‌ను సేకరించారు. ఖరీఫ్ సీజన్ మొదలు కావడంతో రైతులు వరి విత్తనాలను విరివిగా కొనుగోలు చేస్తుండటంతో నకిలీ విత్తనాలు కొనుగోలు చేసి రైతులు నష్ట పోకుండా విత్తనదుకాణాలను తనిఖీ చేశామని ఏఓ చెప్పారు.

నేడు కుక్కలకు వ్యాక్సినేషన్

నంద్యాల(సెంట్రల్): ప్రపంచ జూనోసిస్‌డే సందర్భంగా నేడు స్థానిక ప్రాంతీయ పశువైద్యశాలలో వీధి, పెంపుడు కుక్కలకు ఉచితంగా రేబిస్ వ్యాధి నివారణ టీకాలు వేస్తామని ఇన్‌చార్జ్ జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి డాక్టర్ సుబ్బారెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కుక్క కాటుతో మనుషులకు రేబిస్ వ్యాపిస్తుందని, వ్యాధి ముదిరిన తర్వాత చికిత్స కంటే.. ముందు జాగ్రత్తగా శునకాలకు టీకాలు వేయిస్తే వ్యాధిని అదుపులో ఉంచవచ్చని పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని పశువుల ఆస్పత్రులలో గురువారం కుక్కలకు ఉచితంగా టీకాలు వేస్తున్నందున ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సచివాలయానికి ప్రింటర్ విరాళం

రుద్రవరం:మండలంలోని మందలూరు గ్రామ సచివాలయానికి సర్పంచు నగిలి నిర్మలమ్మ బుధవారం రూ.15వేల విలువ చేసే ప్రింటర్ ను విరాళంగా అందజేశారు. దీంతో సచివాలయ సిబ్బంది సర్పంచు, ఆమె భర్త శ్రీనివాసరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కొన్ని నెలలుగా సచివాలయంలో ప్రింటర్ లేక ఇబ్బందులు పడేవారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలతో పాటు వివిధ రకాల ధ్రువ పత్రాలు ప్రింటింగ్ తీసేందుకు ప్రింటర్ లేక గ్రామస్తులు అవస్థలు పడుతుండటాన్ని గమనించి వారు ప్రింటర్ అందజేశారు. దీంతో సమస్యలకు పరిష్కారం లభించినట్లయ్యింది.

కడపకు వెళ్లి పింఛన్ పంపిణీ


కనకమ్మకు పింఛన్ అందజేస్తున్న విజయ్‌కుమార్

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని 33 వార్డుకు చెందిన వృద్ధురాలు నాగులారపు కనకమ్మ అనారోగ్య రీత్యా కడపలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. విషయం తెలుసుకున్న వలంటీర్ విజయ్‌కుమార్ బుధవారం అక్కడికి వెళ్లి ఆమెకు పింఛన్ పంపిణీ చేశారు. డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ నేటితో వంద శాతం పింఛన్ల పంపిణీ పూర్తయ్యిందని తెలిపారు.


ఈమె పేరు శంకరమ్మ. ఆళ్లగడ్డ మండలం బత్తులూరు గ్రామం. ఈమెకు కృత్తిక్ అనే 5నెలల బాబు ఉన్నాడు. రక్తంలో ఇన్ఫెక్షన్ ఉందని ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స చేయించారు. రూ.40 వేల వరకు ఖర్చయినా బాబు ఆరోగ్యం మెరుగు పడలేదు. అయితే ఇక్కడి వైద్య సేవల గురించి తెలుసుకుని నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో చేరారు. బాబుకు ఉచితంగా రక్త పరీక్షలు నిర్వహించిన అనంతరం మెరుగైన చికిత్స అందించి మందులు కూడా అందజేశారు. ప్రస్తుతం శిశువు ఆరోగ్యం గతంతో పోలిస్తే చాలా మెరుగైంది. బిడ్డ ఆరోగ్యవంతుడు కావడం సంతోషంగా ఉందని, వైద్యులకు ఎన్ని కృతజ్ఞతలు చెప్పినా తక్కువేనని ఆ తల్లి ఆనందంతో చెబుతుంది.


ఈ ఫొటోలోని బాలింత మహానంది గ్రామానికి చెందిన లక్ష్మి. కాన్పు కోసం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి వారం క్రితం వచ్చింది. నెలలు నిండడంతో తీవ్ర ప్రసవవేదనతో ఉన్న లక్ష్మికి వైద్యులు ధైర్యం చెప్పి సురక్షితంగా సుఖ ప్రసవం చేశారు. లక్ష్మికి మగ శిశువు జన్మించాడు. బాబు పుట్టగానే రక్త నమూనాలు తీసుకుని పసరికలు లాంటి జబ్బులు ఉన్నాయా అని పరీక్షలు చేసి, శిశువు ఆరోగ్యంగా ఉన్నాడని ఎలాంటి ఇబ్బంది లేదని చెప్పటంతో తాను కుదుట పడ్డానని, వేల రూపాయలు ఖర్చు పెట్టి వైద్యం చేయించుకోలేని తమను ఇక్కడ చాలా బాగా చూసుకున్నారని, ఎక్కడికీ వెళ్లవలసిన అవసరం లేకుండా పరీక్షలు, వైద్య సేవలు అందజేయడం సంతోషంగా ఉందని చెబుతోంది.

అమ్మకు అండగా.. శిశువుకు రక్షగా

- రోజుకు 200 మంది గర్భిణులకు ఓపీ సేవలు
- ప్రతి నెలా 350 నుంచి 400 వరకు కాన్పులు
- అపుడే పుట్టిన, నెలల వయసున్న శిశువులపై ప్రత్యేక శ్రద్ధ
- ప్రతి నెల 370 మంది చిన్నారులకు మెరుగైన చికిత్స
- అధునాతన సౌకర్యాలతో వైద్యం

అమ్మకు.. శిశువుకు.. నంద్యాల సర్వజన ఆసుపత్రిలోని ప్రసూతి విభాగం బాసటగా నిలుస్తోంది. ఆసుపత్రికి వచ్చిన ప్రతి గర్భిణికి సుఖ ప్రసవం చేయడమే లక్ష్యంగా ఇక్కడి వైద్యులు, సిబ్బంది పనిచేస్తున్నారు. ప్రభుత్వం సమకూర్చిన అత్యాధునిక సౌకర్యాలతో తల్లీ,బిడ్డను కంటికి రెప్పలా చూసుకుంటున్నారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో చేతులెత్తేసిన కేసులను కూడా సవాలుగా తీసుకొని బాధితులను ఆరోగ్య వంతులుగా మార్చి పంపుతున్నారు. ఉచితంగా నాణ్యమైన వైద్య సేవలందుతుండటంతో బాధితులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

నంద్యాల టౌన్: నంద్యాల సర్వజన ఆసుపత్రిలో కార్పొరేట్‌కు మించి ప్రసూతి విభాగం వైద్యులు సేవలు అందిస్తూ అమ్మకు అండగా నిలుస్తున్నారు. ఆసుపత్రిలో నిత్యం 10 నుంచి 15 ప్రసవాలు చేస్తుటారు. ప్రతి రోజు 200 మంది గర్భిణులు, బాలింతలు పలు సమస్యలతో పరీక్షల నిమిత్తం వస్తుంటారు. వీరందరికీ మెరుగైన సేవలు అందించేందుకు వైద్యులు, సిబ్బంది శక్తివంచన లేకుండా సేవలు చేస్తున్నారు. అలాగే ప్రతి నెల 300 నుంచి 400 వరకు కాన్పులు చేస్తున్నారు.

అందుబాటులో అత్యాధునిక సేవలు..

తల్లీ,బిడ్డకు నాణ్యమైన వైద్యం ఉచితంగా అందించేందుకు ప్రభుత్వం అత్యాధునిక యంత్రాలు అందుబాటులో ఉంచింది. ఆపరేషన్ థియేటర్ ప్లానింగ్ సర్జరీ, ఎమర్జెన్సీ సర్జరీ, సెప్టిక్ సర్జరీలకు ప్రత్యేకమైన వసతులు ఉన్నాయి. వెంటిలేటర్స్‌తో కూడిన 10 పడకలతో ఐసీయూ, 50 పడకలతో ఆధునిక


చిన్నారుల కోసం అత్యాధునిక సౌకర్యాలతో కూడిన ఎస్ఎన్‌సీయూ వార్డు

వార్డు అందుబాటులో ఉన్నాయి. గర్భిణులకు స్కానింగ్ చేసేందుకు అల్ట్రాసౌండ్ స్కానింగ్ యూనిట్లను కూడా సమకూర్చింది. ఇక్కడికి డెలివరీకి వచ్చే వారిలో క్లిష్టమైన కేసులే అధికం. తీవ్రమైన రక్త హీనతతో వచ్చే వారు ఎక్కువగా ఉంటున్నారు. ప్రసవ సమయంలో వచ్చిన వారికి పరీక్ష చేస్తే హిమోగ్లోబిన్ 6 లేదా 7 శాతం ఉంటుంది. అలాంటి వారికి రెండు, మూడు యూనిట్లు రక్తం కూడా అవసరం అవుతుంది. మధుమేహం, అధిక రక్తపోటు, థైరాయిడ్ ఉన్న వారు వస్తుంటారు. వారికి ప్రత్యేకమైన చికిత్స అందిస్తున్నారు.

చిన్నారులకు ప్రత్యేక సేవలు..

పుట్టగానే ఉమ్మ నీరు తాగిన, బరువు తక్కువగా ఉన్న, నెలలు నిండకుండానే పుట్టిన, ఇతర సమస్యలతో ఉన్న శిశువులను కంగారు కేర్‌లో ఉంచి నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రత్యేక చికిత్స అందిస్తున్నారు. కంగారు కేర్‌లో ఒకేసారి 20 మంది శిశువులకు వైద్యం అందించే సదుపాయం ఉంది. అపుడే పుట్టిన పిల్లల రక్త నమూనాలు సేకరించి వివిధ రకాల రక్త పరీక్షలు నిర్వహిస్తున్నారు. పరీక్షల్లో పసరికలు లాంటి ఏవైనా ఉన్నట్లు తేలితే వెంటనే వారికి నిపుణులైన వైద్యుల పర్యవేక్షణలో చికిత్స అదిస్తున్నారు. అలాగే ప్రతి రోజు 35 నుంచి 40 మంది చిన్నారులు వివిధ రకాల అనారోగ్య సమస్యలతో ఓపీ విభాగానికి వస్తుంటారు. వీరిలో 10 నుంచి 20 మంది చిన్నారుల వరకు చికిత్స నిమిత్తం ఆసుపత్రిలో చేరుతున్నారు. ప్రతి నెల 370 మంది చిన్నారులు మెరుగైన వైద్యం చేయిచుకుని డిశ్చార్జ్ అవుతున్నారు.

మాతా శిశువులకు అత్యుత్తమ సేవలు



ప్రసూతి విభాగానికి వచ్చిన ప్రతి ఒక్కరికీ అత్యుత్తమ సేవలు అందిస్తున్నాం, ప్రతి నెల దాదాపు 350 పైగా కాన్పులు చేస్తున్నాం. ఇందుకోసం అత్యాధునిక ఆపరేషన్ థియేటర్, ఐసీయూలు అందుబాటులో ఉన్నాయి. అప్పుడే పుట్టిన, నెలల వయసు ఉన్న చిన్నారులను ప్రత్యేక వార్డుల్లో ఉంచి వైద్యం అందిస్తున్నాం. నిపుణులైన వైద్యులు, వైద్య సిబ్బంది పర్యవేక్షణలో బాలింతలకు, చిన్నారులకు నిరంతరం వైద్య సేవలు అందిస్తున్నాం.

– డాక్టర్ ప్రసాదరావు, ఆసుపత్రి సూపరింటెండెంట్

నేడు సాంబవరంలో 'జగనన్న సురక్ష'

గోస్పాడు: మండలంలోని సాంబవరం గ్రామంలో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ఎంపీడీఓ భాస్కర్ తెలిపారు. ప్రజలకు ఈ కార్యక్రమం ద్వారా కుల, ఆదాయ, జనన, మరణ, సీసీఆర్సీ కార్డులు, రేషన్ కార్డు డివిజన్, హౌస్ హోల్డ్ డివిజన్ తదితర 11 రకాల ధ్రువ పత్రాలు అందజేస్తామని చెప్పారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వృద్ధుడి అదృశ్యం


తిరుపాలు

దొర్నిపాడు: మండలకేంద్రానికి చెందిన రామోజీ తిరుపాలు(70)అనే వృద్ధుడు అదృశ్యమయ్యాడని ఏఎస్ఐ మౌలాలి బుధవారం తెలిపారు. గత నెల 13న ఇంటి నుంచి చెప్పకుండా వెళ్లిపోయాడని, ఇంతవరకు జాడ తెలియకపోవడంతో భార్య మరియమ్మ పోలీసులను ఆశ్రయించింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసున మోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

విధుల్లో చేరిన సీహెచ్‌ఓ


డాక్టర్ నాగేంద్రకు జాయినింగ్ రిపోర్టు అందజేస్తున్న రవికుమార్

దొర్నిపాడు: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్‌గా రవికుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సంజామల పీహెచ్‌సీ నుంచి ఆయన బదిలీపై వచ్చారు.ముందుగా జాయినింగ్ రిపోర్టును డాక్టర్ నాగేంద్రకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ఏఎన్‌ఎంలు, ఆశాల సహకారంతో ప్రభుత్వ కార్యక్రమాలు నిర్వహిస్తామని, లెప్రసీ, టీబీ, ఎన్‌సీడీసీడీ సర్వేలను త్వరగా పూర్తి చేస్తామని చెప్పారు.

ఉద్యోగులు సమయపాలన పాటించాలి


రికార్డులను తనిఖీ చేస్తున్న డీపీఓ మంజులవాణి

గోస్పాడు: సచివాలయాల సిబ్బంది సమయపాలన పాటించాలని జిల్లా పంచాయతీ అధికారి మంజులవాణి సూచించారు. స్థానిక సచివాలయాన్ని బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యలయ రికార్డులను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ నీటి ట్యాంక్‌లను ప్రతి పదిహేను రోజులకొకసారి శుభ్రం చేయాలన్నారు.అలాగే క్లోరినేషన్ తప్పనిసరిగా చేపట్టాలని ఆదేశించారు. గ్రామాల్లో చెత్త చెదారాన్ని ఎక్కడ పడితే అక్కడ పడవేయకుండా చెత్త సంపద కేంద్రాలకు తరలించాలన్నారు. జిల్లాలో 489 చెత్త కేంద్రాలకు గాను 309 కేంద్రాలు పూర్తయ్యాయని తెలిపారు. దోమల నివారణకు ఫాగింగ్ చేయాలని సూచించారు. సర్పంచ్ ప్రమీళ, ఈఓఆర్‌డీలు నాగేంద్రుడు, అనసూయమ్మ, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ పాల్గొన్నారు.


యల్లావత్తుల గ్రామంలో కురుస్తున్న వర్షం

భారీ వర్షం

రుద్రవరం: మండంలోని పలు ప్రాంతాల్లో బుధవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. యల్లావత్తుల, టి.కొట్టాల, శ్రీరంగాపురం, బీరవోలు తదిగర గ్రామాల్లో వాగులు వంకలు పొంగి పొర్లాయి. ఇటీవల ఖరీఫ్‌లో సాగుచేసిన పంటలకు ఈ వర్షం ఎంతో ఉపయోగపడుతుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి


డీఈఓకు వినతి పత్రం ఇస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): జిల్లాలోని ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ఫ్యాప్టో నాయకులు కోరారు. బుధవారం ఫ్యాప్టో జిల్లా చైర్మన్ మాధవస్వామి సెక్రెటరీ సుబ్బన్న ఆధ్వర్యంలో డీఈఓకు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల రీఆఫర్స్‌మెంట్ ద్వారా బదిలీ అయిన ఉపాధ్యాయుల జీతాల సమస్యలను పరిష్కరించాలని, ఉర్దూ, స్పెషల్ తెలుగు పాఠ్య పుస్తకాలను పాఠశాలలకు చేర్చాలన్నారు. నాడు–నేడు పనులకు ఉపాధ్యాయులపై ఒత్తిడి తీసుకురావడంతో బోధనకు ఇబ్బంధికరంగా మారిందని చెప్పారు. డీఈఓ మాట్లాడుతూ సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. శివయ్య, ప్రసాద్, జమాల్ కిషోర్, ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నగరి శ్రీనివాసులు, చంద్రశేఖర్, రామచంద్రారెడ్డి, దస్తగిరి, రవి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ఈయూ కృషి


మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సయ్య

నంద్యాల(వ్యవసాయం): ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో ఏపీపీటీడీ ఎంప్లాయీస్ యూనియన్ ఎల్లప్పుడూ ముందుంటుందని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సయ్య తెలిపారు. బుధవారం స్థానిక ముబారక్ ఫంక్షన్ హాల్‌లో ఉమ్మడి జిల్లా కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా నర్సయ్య పాల్గొని మాట్లాడుతూ...ఏపీజేఏసీతో కలిసి సుదీర్ఘంగా చేసిన పోరాటాల ఫలితంగా పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలు, బకాయిలు, ట్రెజరీలోని ఇబ్బందులు పరిష్కారమయ్యాయని చెప్పారు. లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, డీఏ బకాయిలు కూడా జూలై నెల జీతాల్లో సర్దుబాటు చేస్తామని అధికారులు తెలిపారన్నారు. పెండింగ్‌లో ఉన్న రిటైర్డ్ ఆర్టీసీ కుటుంబాలకు చెందాల్సిన గ్రాట్యుటీ, లీవ్‌ఎన్‌క్యాష్‌మెంట్ తదితర సమస్యలపైనా త్వరలో పరిష్కారానికి ప్రయత్నం చేస్తామని వెల్లడించారు. సీనియర్ న్యాయవాది వెదుర్ల రామచంద్రారావు, నంద్యాల జిల్లా అధ్యక్షులు శివారెడ్డి, కార్యదర్శి ఆర్ఎస్ రావు, రాయుడు, వెంకటేశ్వర్లు, రాజశేఖర్, కుమార్,రంగస్వామి, మద్దిలేటి, సీఐలు పాల్గొన్నారు.

గ్రామీణులకు మెరుగైన వైద్య సేవలు


ఉయ్యాలవాడ పీహెచ్‌సీలో ఓపీ రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ

ఉయ్యాలవాడ : వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బంది గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్యాధికారి వెంకటరమణ ఆదేశించారు. బుధవారం స్థానిక 24 గంటల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఓపీ రిజిస్టర్, ల్యాబ్, మందుల స్టాక్‌ను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పాముకాటు, తేలుకాటు, కుక్కకాటు, రోడ్డు ప్రమాదాలు తదితర వాటికి చికిత్సల కోసం పట్టణ ఆరోగ్య కేంద్రాలకు పంపకుండా గ్రామస్థాయిలోనే మందులను అందుబాటులో వుంచి మెరుగైన వైద్యం అందిస్తున్నామని చెప్పారు. ప్రజలు చిన్న, చిన్న ఆరోగ్య సమస్యలకు పట్టణాల్లోని ప్రైవేట్ హాస్పిటళ్లకు వెళ్లకుండా ఫ్యామిలీ ఫిజీషియన్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం ఆరోగ్య కేంద్రం ఆవరణలో రూ.1.80 కోట్లతో నిర్మిస్తున్న నూతన పీహెచ్‌సీ భవనాన్ని పరిశీలించారు. వైద్యాధికారులు రమేష్‌చంద్ర బాలాజీ, వెంకటసుబ్బయ్య, హెల్త్ సూపర్‌వైజర్ దస్తగిరి పాల్గొన్నారు.

అన్ని వర్గాల అభివృద్ధికి ప్రభుత్వ కృషి


చాగలమర్రిలో మహిళకు పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

చాగలమర్రి: అన్ని వర్గాల ప్రజల అభివృద్ధికి జగనన్న ప్రభుత్వం అన్ని విధాలుగా తోడ్పాటు అందిస్తుందని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పేర్కొన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక 3వ సచివాలయ పరిధిలోనున్న ఎస్టీ కాలనీ, చాగలమ్మ చెంచు కాలనీ, కోట గడ్డ వీధుల్లో ఇంటింటికీ తిరిగి పథకాలు, లబ్ధిపొందిన మొత్తాన్ని వివరించారు. ముందుగా ఆయా కాలనీల్లో ఆయనకు ఘన స్వాగతం లభించింది. మహిళలు హారతులు పట్టి స్వాగతం పలికారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని రైతులకు సుమారు రూ.9 కోట్ల వరకు వైఎస్సార్ ఉచిత బీమా నష్టపరిహారం మంజూరు చేశారన్నారు. త్వరలోనే ఈ పరిహారం రైతుల అకౌంట్లలో జమ అవుతుందన్నారు. రైతులకు అవసరమైన ఎరువులు ఆర్బీకేల్లో అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఐటీడీఏ ఆధ్వర్యంలో మండలంలోని డి.వనిపెంట చెంచుగుడెం, చాగలమ్మ చెంచుగుడెం గిరిజనులకు 60 గృహాలు మంజూరయ్యాయన్నారు. వచ్చే నెల మరింత మంది అర్హులకు పింఛన్లు మంజూరవుతాయన్నారు. మండలంలో అర్హులకు రెండో విడత ఇళ్ల స్థలాలు పంపిణీ చేస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మైనార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాబులాల్, మండల కన్వీనర్ కుమార్‌రెడ్డి, మండల కో ఆప్షన్ సభ్యుడు జె.ఇబ్రహీం, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు గణేష్ రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు దస్తగిరి, వైస్ ఎంపీపీ ముల్లా రఫి, ఉప సర్పంచ్ మహమ్మద్ సోహెల్, ప్రచారకార్యదర్శి రఫీ, ఎంపీటీసీ సభ్యులు యం.ఫయాజ్, లక్ష్మీరెడ్డి, మాజీ సర్పంచ్ రమణారెడ్డి, నాయుడు, మనోహర్‌రెడ్డి వార్డు సభ్యులు కె.అబ్దుల్లా, షరీఫ్, మన్సూర్, నాయకులు నాయబ్‌రసూల్, ఖాజాహుసేన్, చక్రం షబ్బీర్, ముల్లా ఖాదర్‌బాష, టి.నాగేంద్ర గేట్ల మాబు అధికారులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

ఆళ్లగడ్డ : పట్టణంలోని రామలక్ష్మి కొట్టాల కాలనీకి చెందిన ఓ యువతి అదృశ్యమైందని సీఐ రమేష్ బాబు బుధవారం తెలిపారు. గత నెల 20వ తేదీ బజారుకు వెళ్లి వస్తానని చెప్పి ఇంట్లో నుంచి వెళ్లింది. ఎంతకూ తిరిగి రాకపోయేసరికి పలు చోట్ల విచారించినా ఆచూకీ లభ్యం కాలేదు. యువతి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

పాఠ్యపుస్తకాలు ఉచితంగా ఇవ్వాలి

నంద్యాల(న్యూటౌన్): ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివే ఇంటర్ విద్యార్థులకు ఉచితంగా పాఠ్య పుస్తకాలు ఇవ్వాలని ఎస్ఎఫ్ఐ నాయకులు బుధవారం ఆర్‌డీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు.

బంద్ విజయవంతం

ఏబీవీపీ రాష్ట్ర సమితి పిలుపు మేరకు బుధవారం చేపట్టిన విద్యాసంస్థల బంద్ నంద్యాల జిల్లాలో విజయవంతమైంది. వెంకటేష్ పవన్, మహేంద్ర, అనంద్ పాల్గొన్నారు.

వసతి గృహాల్లో మెరుగైన వసతులు

దొర్నిపాడు: వసతి గృహాల్లో ప్రభుత్వం మెరుగైన వసతులను కల్పించిందని జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీదేవి అన్నారు. బుధవారం స్థానిక బీసీ బాలికల వసతి గృహాన్ని తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం భోజన వసతిని కల్పించాలని, తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని వార్డెన్ చైతన్యను ఆదేశించారు. 3–10వ తరగతి వరకు చదువున్న బాలికలు హాస్టల్‌లో చేరుందుకు దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు.

జగజ్జననీ మాతకు సారె సమర్పణ

నంద్యాల(వ్యవసాయం): ఆషాడ మాసాన్ని పురస్కరించుకొని బుధవారం భక్తులు, భక్తబృందాలు జగజ్జననీ మాతకు మేళతాళాలతో ఊరేగింపుగా వచ్చి సారె సమర్పించారు.

నేడు ఆర్బీకే ప్రారంభోత్సవం

శిరివెళ్ల: గంగవరంలో పలు అభివృద్ధి పనులు పూర్తయ్యాయి. రూ. 21.08 లక్షలతో రైతు భరోసా కేంద్రం భవనం, రూ.17 లక్షలతో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం కింద రెండు అంతర్గత సిమెంట్ రోడ్ల నిర్మాణాలు పూర్తి చేశారు. వాటిని ఈ నెల 6వ తేదీన ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి ప్రారంభిచనున్నారు. అలాగే అదే రోజు జగనన్న సురక్ష కింద సర్టిఫికెట్ల పంపిణీ జరగనుంది.

కేసు నమోదు

చాగలమర్రి: స్థానిక ఎస్సీ కాలనీలో మంగళవారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి వస్తున్న సందర్భంగా కొత్త ఎస్సీ కాలనీకి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త లూర్థయ్య బ్యానర్ ఏర్పాటు చేయగా టీడీపీకి చెందిన రవి బ్యానర్‌ను తొలగించాడు. దీంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. ఇద్దరి ఫిర్యాదు మేరకు బుధవారం ఇద్దరిపై పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిసింది.

పారదర్శక పాలనకు ఆద్యుడు జగనన్న


మహిళకు పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవి

నంద్యాల రూరల్: ఇంతకు ముందెన్నడూ లేనట్లుగా అర్హులకే పథకాలు అందజేస్తూ, లబ్ధిని వారి వ్యక్తిగత బ్యాంక్ ఖాతాల్లో జమ చేస్తూ పారదర్శక పాలనకు ఆద్యుడుగి సీఎం జగనన్న చరిత్ర సృష్టించారని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిశోర్ రెడ్డి పేర్కొన్నారు.. బుధవారం మండలంలోని అయ్యలూరు గ్రామంలో మండల సచివాలయ కన్వీనర్ బసవేశ్వర్ రెడ్డితో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి బుక్‌లెట్ అందజేసి అందిన పథకాలు, లబ్ధి పొందిన మొత్తంను వివరించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అపరిష్కృతంగా ఉన్న సమస్యలు పరిష్కారానికి ప్రజా ప్రతినిధులు, అధికారులు సమష్టిగా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ శెట్టి ప్రభాకర్, ఎంపీడీఓ సుగుణ శ్రీ , సాగునీటి సంఘం అధ్యక్షుడు రవికుమార్ రెడ్డి, వైస్ ఎంపీపీ పుష్పలత, ఎంపీటీసీ రషీద్, వైస్ సర్పంచ్ శివలలిత, సర్పంచ్ ఓబులేసు, షఫీ, నాయకులు పరమేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

హౌసింగ్ కార్పొరేషన్ అభివృద్ధికి కృషి చేయాలి



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్

నంద్యాల(సిటీ): హౌసింగ్ కార్పొరేషన్ అభివృద్ధికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ తెలిపారు. బుధవారం స్థానిక పద్మావతినగర్‌లో హౌసింగ్ కార్పొరేషన్ 45వ వార్షికోత్సవ వేడకలు ఘనంగా నిర్వహించారు. గృహ నిర్మాణశాఖ పీడీ విజయభాస్కర్ నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటికే గృహ నిర్మాణాల్లో పురోగతి సాధించారని, ఇదేవిధంగా ముందుకు సాగాలని సూచించారు. వేడుకలను పురస్కరించుకుని హౌసింగ్ సిబ్బందికి పలు సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడా పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఇటీవల హౌసింగ్ కార్పొరేషన్‌లో విధులు నిర్వర్తిస్తూ పదవీవిరమణ పొందిన ఉద్యోగులను సన్మానించారు. డీఈఈలు ఉమామహేశ్వరరావు, సుబ్బారెడ్డి, ఏఈలు షేక్ అహ్మద్‌బాషా, వాసుదేవుడు, వర్క్ ఇన్‌స్పెక్టర్ సికిందర్ పాల్గొన్నారు.

అందరికీ సంక్షేమమే ధ్యేయం


మాయలూరులో ధ్రువ పత్రాలు అందజేస్తున్న ఎంపీపీ, అధికారులు

ఉయ్యాలవాడ : అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు, సేవలను చేరువ చేసి ప్రజల ముఖాల్లో చిరునవ్వులు చిందించడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ధ్యేయమని ఎంపీపీ బుడ్డా భాగ్యమ్మ అన్నారు. బుధవారం మండలంలోని మాయలూరు గ్రామ సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ జనపాల సాయిరెడ్డితో కలిసి గ్రామస్తులకు అవసరమైన వివిధ ధ్రువ పత్రాలను అందజేశారు. జగనన్న సురక్షలో భాగంగా ఇటీవల గ్రామ వలంటీర్లు ఇంటింటా చేసిన సర్వేలో 55 మందికి టోకెన్లు జారీ చేయగా వారందరికీ ధ్రువపత్రాలను పంపిణీ చేశారు. తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి సురేష్ బాబు, డిజిటల్ అసిస్టెంటు మౌలాలి పాల్గొన్నారు.